
ప్రజాశక్తి
ఆదివారం 18 జూన్ 2023



20న జాబ్‌మేళా

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ వారి ఆధ్వర్యంలో ఉపాధికల్పనలో భాగంగా ఈనెల 20న స్థానిక శ్రీవెంకటేశ్వర ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో మినీ జాబ్‌మేళా నిర్వహించనున్నట్టు నిర్వాహణాధికారి యు.సాయికుకమార్ ఒకప్రకటనలో తెలిపారు. బిటెక్ (సిఎస్ఇ, ఐటి)లో ఉత్తీర్ణత సాధించిన వారు సాఫ్ట్వేర్ డెవలపర్‌గా, ఎంబిఏ పూర్తి చేసిన వారికి హెచ్ఆర్, అడ్మిన్ స్ట్రేషన్, టెన్త్, ఇంటర్, ఐటిఐ పూర్తి చేసుకున్న వారు ఆపరేటర్లుగా వైఎస్‌కె ఇన్ఫోటెక్ కంపెనీలో ఉద్యోగాలు కలిపించనున్నట్టు తెలిపారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు వారి వివరాలను www.apssdc.in వెబ్ సైట్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9182398325, 7997299739 నందు సంప్రదించాలన్నారు.



విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేసిన కలెక్టర్ నిశాంత్‌కుమార్, ఎమ్మెల్యే జోగారావు

విద్యార్థి దశే కీలకం : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

మనిషి వ్యక్తిత్వ వికాసానికి, సమాజ అభివృద్ధికి విద్యార్థి దశ కీలకమని కలెక్టరు నిశాంత్ కుమార్ తెలిపారు. శనివారం సి-కన్వెన్షను సెంటరులో ఏర్పాటు చేసిన జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిధిగా విచ్చేశారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు పాఠశాల, నియోజకవర్గం, జిల్లా, రాష్ట్ర స్థాయిలో విద్యార్థులను సన్మానిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రస్థాయి సన్మానానికి జిల్లా నుంచి కర్రి షర్మిల, పాలక గురునాథ్, ఆరిక నందిని ఎంపికయ్యారని వీరిని ఈనెల 25న ముఖ్యమంత్రి సన్మానించనున్నట్టు తెలిపారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రుల ఉమ్మడి కృషితో ఎవరూ ఊహించని విధంగా పదో తరగతిలో రాష్ట్రంలోనే ఉత్తీర్ణత శాతంలో మొదటి స్థానం సంపాదించి జిల్లా ప్రత్యేకత చాటుకుందని తెలిపారు. ఎమ్మెల్యే అలజంగి జోగారావు మాట్లాడుతూ రాష్ట్ర స్థాయిలో టెన్త్ ఉత్తీర్ణత శాతంలో మొదటి స్థానం సాధించేందుకు సరైన ప్రణాళిక, ఆదేశాలు అందజేసిన జిల్లాకలెక్టరుకు అభినందనలు తెలిపారు. నాడు నేడు ద్వారా పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పన, విద్యార్థులు ఆరోగ్యంగా ఉండేలా పౌష్టికాహార పంపిణీ, ఏకరూప దుస్తులు, ఉపకారవేతనాలు ప్రభుత్వం అందిస్తుందన్నారు. ఈ ఏడాదీ జిల్లా ఉత్తమ ఫలితాలు సాధించేలా వెనుక బడిన పాఠశాలలను గుర్తించి వాటిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. ఎమ్మెల్సీ పాలకపాటి రఘువర్మ మాట్లాడుతూ మన్యం వెనుకబడిన జిల్లా కాదని మకుటంలేని జిల్లాగా నిరూపించుకొందని, భవిష్యత్తులో ఇదే స్ఫూర్తి కొనసాగించాలని కోరారు. డిఇఒ ఎన్.ప్రేమ్ కుమార్ మాట్లాడుతూ జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో భాగంగా జిల్లాలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన జూనియర్ కళాశాల, హైస్కూలు విద్యార్థులను, ఉపాధ్యాయులను, విద్యార్థుల తల్లిదండ్రులను సన్మానిస్తున్నామన్నారు. అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు పాఠశాలల వారీగా, నియోజకవర్గ స్థాయిలో సన్మాన కార్యక్రమాలు నిర్వహించి, ఈరోజు జిల్లా స్థాయిలో నిర్వహించగా, 25న రాష్ట్ర స్థాయిలో సన్మాన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లా నుండి జూనియర్ కళాశాలలకు చెందిన 19 మంది విద్యార్థులకు, ఏడు పాఠశాలలకు చెందిన 24 మంది విద్యార్థులకు మొదటి బహుమతిగా రూ.50వేలు, రెండో బహుమతిగా రూ.30వేలు, మూడో బహుమతిగా రూ.10వేలు విద్యార్థులకు అందించినట్లు తెలిపారు. జిల్లా ఒకేషనల్ విద్యాశాఖాధికారి మంజులవీణ, ట్రైబల్ వెల్ఫేర్ ఉప సంచాలకులు పి. సూర్యనారాయణ ప్రసంగించి విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో మునిసిపల్ ఛైర్ పర్సన్ బోను గౌరీశ్వరి, ఉపాధ్యాయులు, విద్యార్థులు ,తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నత్తనడకన 'నాడు-నేడు'

- పూర్తికాని అదనపు గదుల నిర్మాణం
- శాపంగా మారిన నిధుల విడుదల
- విద్యార్థులకు తప్పని అవస్థలు

దాదాపు నెలా 15 రోజుల తర్వాత పాఠశాలలకు వేసవి సెలవులు ముగిసిన అనంతరం గత సోమవారం నుంచి తరగతులు ప్రారంభమయ్యాయి. అయినప్పటికీ నాడు- నేడు పనులు జరుగుతున్నా ఇంకా చాలా పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన పూర్తి స్థాయిలో జరగలేదు. కొన్ని గ్రామాల్లో పాఠశాలల పరిస్థితి కొంత ఫర్వాలేకున్నా... మరి కొన్ని పాఠశాలల పరిస్థితి అధ్వానంగా ఉంది. నిధులు విడుదలలో తీవ్ర జాప్యం ఉండడం వల్లే పనులు నత్తనడకన సాగుతున్నాయన్నాయి. దీంతో విద్యార్థులు అవస్థలు పడుతూ చదువులు కొనసాగిస్తున్నారు.



ఫిల్లర్లకే పరిమితమైన కెజిబివి పాఠశాల అదనపు తరగతి గదుల పనులు

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మౌలిక వసతుల కల్పన కోసం రెండో దశ నాడు - నేడు కింద చేపట్టిన పనులు నత్తడకన నడుస్తున్నాయి. ఆరంభంలో ఆర్భాటం చేసిన నిధులు సక్రమంగా విడుదల కాకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. 2022-23 ఆర్థిక సంవత్సరంలో మంజూరైన పనులకు నిధులు విడుదల్లో జాప్యం కారణంగా పనులు ముందుకు సాగడం లేదు. మంజూరైన పనులకు ఇప్పటి వరకు సగం వంతు నిధులు మాత్రమే విడుదలయ్యాయి. మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యానికి సంబంధించిన పనులను పాఠశాలలు పునఃప్రారంభానికి ముందే (ఈనెల 12లోపు) పూర్తి చేయాలని అధికారులు ఆదేశించారు. అయినప్పటికీ పురోగతి కరువైంది. నిధులు విడుదల చేయకుండా పనులు పూర్తి చేయాలని అధికారులు ఆదేశిస్తుండడంతో ప్రధానోపాధ్యాయులు, పాఠశాలల తల్లిదండ్రుల కమిటీల ప్రతినిధులు తలలు పట్టుకుంటున్నారు. నిధుల విడుదలలో ప్రభుత్వ నిర్లక్ష్యం నాడు-నేడు పనులకు శాపంగా మారిందని వాపోతున్నారు.

ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, ప్రాథమికోన్నత పాఠశాలలో నాడు - నేడులో భాగంగా అదనపు తరగతి గదుల నిర్మాణ పనులకు రూ. 2 కోట్లు 63 లక్షల మూడు వేలతో 22 పాఠశాలలకు మంజూరైనప్పటికీ ఇప్పటి వరకూ కేవలం రూ.కోటీ 24 లక్షల 43 వేలు నిధులు మాత్రమే ఇంతవరకు విడుదలయ్యాయి. దీంతో పనుల్లో పురోగతి లోపించింది. ఒక్కచోట కూడా పనులు పూర్తి కాలేదు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరిగి తరగతి గదుల కొరత ఉండడంతో వారి సౌకర్యం కోసం అదనపు గదులకు రాష్ట్రప్రభుత్వ గతేడాది నిధులు మంజూరు చేసింది. ఏడు నెలల క్రితం పనులు ప్రారంభించినా ఒక్కచోట కూడా పూర్తి కాలేదు. కురుపాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తొమ్మిది అదనపు తరగతి గదులు మంజూరు కాగా స్లాబ్ పూర్తయింది. ప్లాస్టింగ్, కింద ఫ్లోరింగ్ ఎలక్ట్రికల్ వర్క్, తలుపులు, కిటికీల పనులను జరగలేదు. అలాగే కురుపాం కెజిబివి పాఠశాలలో 4 అదనపు తరగతి గదులు మంజూరైనప్పటికీ ఫిల్లర్ల దశకే పరిమితమైంది. మిగతా చోట్ల కూడా పనులు మందకొడిగా సాగుతున్నాయి. కొన్ని పాఠశాలల్లో మరుగుదొడ్లు లేకపోగా, ఉన్నచోట్ల రన్నింగ్ వాటర్ లేక ఉపయోగించే స్థితిలో లేవు. దీంతో పిల్లలు ఆరు బయటకు వెళ్లక తప్పని దుస్థితి. దీంతో బాలికలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అనేక పాఠశాలల్లో తరగతి గదులు అధ్వానంగా ఉన్నాయి. కొన్ని పాఠశాలలకు ప్రహరీలు లేవు. పక్కనే మురుగు కాలువలు ఉన్నాయి. దీంతో పశువులు, పందులు వంటివి పాఠశాలల ఆవరణల్లో తిరుగుతూ విద్యార్థులకు ఇబ్బంది కలిగిస్తున్నాయి. మరికొన్ని పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం వండేందుకు ప్రత్యేక గదులు లేవు. దీంతో తరగతి గదుల పక్కన లేదంటే పాఠశాలలో ఓ మూలన వంటలు చేస్తున్నారు. ఆరుబయట వంటల వల్ల వర్షాకాలంలో వంటకు ఇబ్బందిగా ఉంటోంది. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి యుద్ధప్రాతిపదికన నాడు - నేడు పనులను పూర్తి చేసి విద్యార్థులకు సౌకర్యాలు కల్పించాలని వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

హెల్త్ సర్వే పరిశీలన

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని దుడ్డుఖల్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఉన్న వనకాబడి, కుశ ప్రజలు హెల్త్ సర్వేకు సహకరించి హెల్త్ కార్డులను పొందాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జగన్నాథరావు తెలిపారు. శనివారం ఆయన దుడ్డుకల్లు పిహెచ్‌సి పరిధిలో ఉన్న వనకాబడి, కుశ గ్రామాల్లో నిర్వహిస్తున్న హెల్త్ సర్వే ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక సచివాలయ సిబ్బందితో మాట్లాడారు. హెల్త్‌సర్వేకు సెల్ సిగ్నల్స్ ఎంతవరకు అందుబాటులో ఉన్నాయని అడిగారు. ఎన్సీడీసీడీ డ్రైవ్‌ను సచివాలయ ఆరోగ్య సిబ్బంది త్వరలోనే పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే ప్రతి ఒక్కరూ ఎవరితో సర్వేకు సహకరించి ప్రభుత్వం అందజేస్తున్న ఉచిత హెల్త్ కార్డులను పొందాలని అన్నారు. ఈయన వెంట దుడ్డుకల్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు, సిబ్బంది తదితరులు ఉన్నారు.



సిడిపిఒ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీ

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

అంగన్వాడీ కార్యకర్తలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించడంతో పాటు, తెలంగాణ కన్నా అదనంగా వేతనాలు పెంచాలని, గ్రాడ్యూటీ అమలు చేయాలని ఇతర సమస్యలు పరిష్కారం చేయాలని కోరుతూ అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం ఎదుట ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వి.ఇందిర, కోశాధికారి జి.వెంకటరమణ మాట్లాడుతూ పెండింగ్ బిల్లులు చెల్లించాలని, గ్రాడ్యూటీ అమలు చేయాలని, పర్యవేక్షణ పేరుతో వేధింపులు ఆపాలని, డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా కార్యదర్శి జి.జ్యోతిలక్ష్మి, నాయకులు కె.రాజేశ్వరి, శాంతి, బి.ధర్మావతి, బి.గిరిమణి, టి.రాజేశ్వరి పాల్గొన్నారు.

బొంకు ఆశయాలే గిరిజన యువతకు ఆదర్శం

సంతాప సభలో సిపిఎం జిల్లా కర్యాదర్శి రెడ్డి వేణు



బొంకులకు నివాళ్ల అర్పిస్తున్న సిపిఎం, గిరిజనసంఘాల నాయకులు

ప్రజాశక్తి - కురుపాం

శ్రీకాకుళ గిరిజన ఉద్యమ నేత మండంగి బొంకు మృతి గిరిజన సంఘానికి, సిపిఎం పార్టీకి తీరని లోటని ఆయన ఆశయాలతో గిరిజన యువత పోరాటాలకు సన్నద్ధం కావాలని సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు పిలుపునిచ్చారు. మండలంలోని వబ్బంగి పంచాయితీ తోలుంగూడలో బొంకు శుక్రవారం రాత్రి మృతి చెందారు. ఆయన పార్థీవ దేహానికి గిరిజన సంఘం, సిపిఎం నాయకులు, ప్రజా ప్రతినిధులు ఘనంగా నివాళ్లు అర్పించారు. అనంతరం జరిగిన సంతాపసభలో రెడ్డి వేణు మాట్లాడుతూ శ్రీకాకుళం గిరిజన ఉద్యమంలో కోరన్న, మంగన్నలతో సహచరుడుగా ఉద్యమంలో పాల్గొని వారిపై కాల్పులు జరిపినప్పుడు బొకు పక్కనే ఉండి వారి ప్రాణత్యాగం చూశారన్నారు. వారి స్పూర్తితో శ్రీకాకుళ రైతాంగ ఉద్యమాన్ని మరింత ముందుకు తీసుకువెళ్లడానికి వెంపటాపు సత్యం, ఆదిబట్ల కైలాసం, చౌదరి తేజేశ్వరరావు నాయకత్వంలో పల్లేరుక రఘురాములు, కొండగొర్రి లచ్చన్న, ఆరికగుంపు స్వామి, సుంచులు, సోములు, రసూల్‌తో కలిసి ఉద్యమాన్ని నిర్మించారని తెలిపారు. వారి పోరాటాల ఫలితమే గిరిజనులు 1/70 చట్టం, జిఒ 3గాని, ఐటిడిఎ, జిసిసిలు, ఆశ్రమ పాఠశాలలు, రోడ్లు వచ్చాయని పేర్కొన్నారు. బొంకు మూడేళ్ల జైలు శిక్ష అనుభవించిన తర్వాత గిరిజన సంఘం, సిపిఎంలో చేరి ఈ ప్రాంతంలోని గిరిజన సమస్యలపై పెద్ద ఎత్తున ఉద్యమించారని కొనియాడారు. ఉపాధి హామీ, అటవీ హక్కుల చట్టాల హక్కులు పోరాటం చేసి సాధించుకున్నారని, ఇప్పుడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజనులు పోరాడి సాధించుకున్న హక్కులను కాలరాస్తున్నార న్నారు. బోయ వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చి గిరిజనులకు రిజర్వేషన్ లేకుండా చూస్తున్నారని ఈ విధానాలకు వ్యతిరేకంగా బొంకు ఆశయంతో గిరిజన యువత పోరాడి గిరిజన, ప్రజా వ్యతిరేక విధానాలను తరిమి కొట్టడానికి సిద్ధంగా ఉండాలని అన్నారు. కార్యక్రమంలో గిరిజన సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోలక అవినాష్, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కొల్లి గంగు నాయుడు, గిరిజన సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు ఎం.రమణ, ఒబ్బంగి సర్పంచ్ కొండగొర్రి అప్పల స్వామి, వైస్ ఎంపిపి బిడ్డిక అన్నాజీరావు, సంఘం జిల్లా నాయకులు కె. సీతారాం, వెంకట రావు, తిరుపతి, ఆడిట్, సత్యం తదితరులు పాల్గొన్నారు.

ఫ్లీట్‌రూం ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - పాలకొండ రూరల్

108, 104,102 అంబులెన్స్‌ల మరమ్మతులకు ఫ్లీట్ రూమ్ ఏర్పాటు చేయాలని కోరుతూ పాలకొండ డివిజన్ అధికారి భాసురు విజయకుమార్, జిల్లా మేనేజర్ మన్మధ నాయుడు శనివారం సబ్ కలెక్టర్ నూరుల్ కమర్‌కు వినతి పత్రం అందించారు. అత్యవసర వైద్య సేవల్లో భాగంగా డివిజన్ పరిధిలో సుమారు 50వరకు అంబులెన్స్‌లు ఉన్నాయని, వీటి నిర్వహణ బాధ్యతను అరబిందో సంస్థ వారు చూస్తున్నారని తెలిపారు. ఇవి మరమ్మతులకు గురైన్పుడు వీటిని పార్వతీపురం, శ్రీకాకుళం జిల్లా కేంద్రాలకు వెళ్లి మరమ్మతులు చేయించుకోవాల్సి ఉంటుందన్నారు. అంత దూరం వెళ్లినప్పుడు ఇక్కడ అత్యవసర సేవలకు ఇబ్బంది అవుతుందని, కావున పాలకొండలోనే మరమ్మతులు చేయించుకుంటే సమయంతో పాటు సేవలకు అంతరాయం కూడా తగ్గుతుందని అన్నారు. వాహనాల మరమ్మతులకు పాలకొండలో ఒక రూమ్ ను (మెకానిక షెడ్) ఇప్పించాల్సిందిగా సబ్ కలెక్టర్‌తో తహాశీల్దార్‌కు కూడా లేఖను ఇచ్చారు. దీనికి అధికారులు సానుకూలంగా స్పందించి త్వరలో రూమ్‌ను ఇచ్చేలా చూస్తాం అని అన్నారు. వీరి వెంట జిల్లా ఫ్లీట్ మేనేజర్ జగ్గ రాజు, భాస్కరరావు ఉన్నారు.

తోటపల్లి దేవాలయ అభివృద్ధికి విరాళం

ప్రజాశక్తి - గరుగుబిల్లి

మండలంలోని తోటపల్లికి చెందిన గవర మధుసూదనరావు, రోజా కుమార్తె మేఘనకు బ్యాంకులో ఉద్యోగం వచ్చినందున మొదటి నెల జీతం విరాళంగా అందజేశారు. ఈ మేరకు శనివారం మొదటి నెల జీతంలో కొంత మొత్తం వెంకటేశ్వర స్వామి వారి హుండీలో సమర్పించగా, మిగిలిన మొత్తాన్ని తోటపల్లి దేవాలయ అభివృద్ధి కమిటీకి అందజేశారు. కార్యక్రమంలో దేవస్థానం సిబ్బంది మార్కొండ మురళి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష మార్గదర్శకాలు అమలు చేయాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్

జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహణ మార్గదర్శకాలను అమలు చేయాలని ఈ కార్యక్రమంలో పరిష్కరించిన దరఖాస్తుల వివరాలు, పరిష్కరించకపోతే అందుకు గల కారణాలతో కూడిన వివరాలను సచివాలయం వారీగా పంపించాలని ముఖ్యమంత్రి కార్యాలయం సెక్రటరీ ఆర్. ముత్యాలరాజు, అదనపు సెక్రటరీ డా.ఎన్.భరత్ గుప్తా తెలిపారు. శనివారం జిల్లా కలెక్టర్లు, జాయింటు కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జగనన్న సురక్ష కార్యక్రమ నిర్వహణపై మార్గదర్శకాలను తెలిపారు. ముఖ్యమంత్రి ఈనెల 23న ప్రారంభిస్తున్న ఈ కార్యక్రమంలో జూలై 1న మొదటి క్యాంపు, చివరి కేంపు ఆగష్టు 1తో ముగిసేలా కార్యక్రమం రూపొందించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో కలెక్టరు నిశాంత్ కుమార్, జాయింటు కలెక్టరు ఆర్. గోవిందరావు పాల్గొన్నారు.

జిల్లాలో ఈనెల 24నుంచి జరగనున్న జగనన్న సురక్ష కార్యక్రమం విజయవంతానికి జిల్లా వ్యాప్తంగా అన్ని మండల, మున్సిపల్ కార్యాలయాల్లో అధికారులు పంచాయతీ, రెవెన్యూ కార్యదర్శులతోనూ, సచివాల సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తీసుకోవాల్సిన విధివిధాలాను సిబ్బందికి వివరించారు.

సాలూరు: జగనన్న సురక్ష కార్యక్రమం పై ప్రజలకు అవగాహన కల్పించాలని మున్సిపల్ కమిషనర్ హెచ్ శంకరరావు స్థానిక మున్సిపల్ కార్యాలయం లో పట్టణం లోని సచివాలయం కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో సూచించారు. పరిష్కారం కాని సమస్యలు ఏమైనా ఉంటే నేరుగా సిఎం జగన్ దష్టికి తీసుకెళ్లే అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలందరూ వినియోగించుకునేలా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహశీల్దార్ బాలమురళీకష్ణ, మున్సిపల్ మేనేజర్ రాఘువాచార్యులు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం: జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కార్యదర్శులు, వీఆర్వోలు కషి చేయాలని ఇన్చార్జి ఎంపిడిఒ జగదీష్ కుమార్ కోరారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో తహశీల్దార్ జె.రాములమ్మ సమక్షంలో సమావేశాన్ని ఏర్పాటు చేసి మాట్లాడారు.

సీతానగరం : జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపిడిఒ ఎంఎస్ఎల్ఎన్ ప్రసాద్, తహశీల్దార్ ఎల్ వి రమణ తెలిపారు. ఈమేరకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ రెవెన్యూ, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

గరుగుబిల్లి : జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని జిల్లా పంచాయతీ అధికారి బలివాడ సత్యనారాయణ అన్నారు. స్థానిక మండల పరిషత్తు అభివద్ధి కార్యాలయంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులు, రెవెన్యూ అధికారులు, సచివాలయ సిబ్బందితో జగనన్న సురక్ష కార్యక్రమంపై సమావేశం నిర్వహించారు. ఈ నెల 24వ తేదీ నుండి నిర్వహించనున్న జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా సచివాలయం సిబ్బంది, వాలంటీర్లు ప్రతి ఇంటికి తిరిగి వారి సమస్యలను తెలుసుకోవాలని, సమస్యలను సంబంధిత పోర్టరులో నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి తహశీల్దార్ పెళ్లూరి సత్యలక్ష్మీకుమార్, ఇఒపిఆర్‌డి లెంక గోపాలరావు, పంచాయతీ కార్యదర్శులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



సాలూరు : సచివాలయ సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న కమిషనర్ శంకరరావు

పాలకొండ : త్వరలో ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న జగనన్న సురక్ష వెబ్ సైట్ పోర్టల్‌పై స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో కమిషనర్ ఎస్ సర్వేశ్వరరావు సచివాలయ అడ్మిన్ సెక్రటరీలు, వెల్ఫేర్ సెక్రటరీలు, రెవెన్యూ సెక్రటరీలు, శానిటేషన్ సెక్రటరీలకు శనివారం అవగాహన కల్పించారు. సచివాలయ సిబ్బంది ప్రీ కాంపెయిన్‌గా మూడు రోజుల ముందు మొత్తం డేటాను సేకరించి ఆన్లైన్ చేసి క్షేత్రస్థాయి సచివాలయ సిబ్బంది పర్యవేక్షణ చేసి వారికి కావాల్సిన సర్టిఫికెట్లు జారీ చేసేలా ప్రణాళికను సిద్ధం చేసుకోవాలన్నారు.

బలిజిపేట: జగనన్న సురక్ష యోజన పథకంలో భాగంగా ఇంటింటి సర్వే ప్రాధాన్యతపై స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు, డిజిటల్ అసిస్టెంట్లకు, సోషల్ వెల్ఫేర్ అసిస్టెంట్లకు ఎంపిడిఒ ఎ.భానుమూర్తి సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఇఒపిఆర్డి రవికుమార్, సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కొమరాడ: జగనన్న సురక్ష కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని తహశీల్దార్ సిహెచ్ రాధాకష్ణ అన్నారు. స్థానికమండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, గ్రామ రెవెన్యూ అధికారులు, డిజిటల్ అసిస్టెంట్లతో జగనన్న సురక్ష కార్యక్రమం విజయవంతం చేయాల్సి విధి విధాలాను వివరించారు. సమావేశంలో ఎంపిడిఒ మల్లికార్జునరావు, ఎఒ రమేష్, ఇఒపిఆర్‌డి రాధాకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

గిరిజన సంక్షేమ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి

19న ఐటిడిఎ వద్ద రాత్రి బస : యుటిఎఫ్


ప్రజాశక్తి - కలెక్టరేట్

గిరిజన సంక్షేమ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పార్వతీపురం రాత్రి బస అనే పోరాట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు యుటియఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టి.రమేష్, ఎస్.మురళీ మోహనరావు తెలిపారు. సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 6న నిరాహార దీక్ష చేశామని, అయినా సమస్యల పరిష్కారంలో అధికారులు, ప్రభుత్వం స్పందించడం లేదని అన్నారు. దీంతో ఈ నెల 19న (సోమవారం సాయంత్రం) 7 గంటల నుంచి మంగళవారం ఉదయం 5 గంటల వరకు యుటిఎఫ్ ఆధ్వర్యంలో స్థానిక ఐటిడిఎ వద్ద రాత్రి బస కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి అధిక సంఖ్యలో ఉపాధ్యాయులు హాజరై జయప్రదం చేయలని కోరారు. పిజి, హెచ్ఎం, స్కూల్ అసిస్టెంట్ క్యాడర్ పోస్టులను ప్రమోషన్ ద్వారా భర్తీ చేయాలని, సవర భాషా వాలంటీర్లను నియమించాలని, సిఆర్‌టిలందరిని రెగ్యులర్ చేయాలని, పండిట్, పిఇటి పోస్టులను అప్ గ్రేడ్ చేయాలని, 10 నెలలుగా బకాయిలున్న మెస్‌ఛార్జీలు చెల్లించాలని, ఎఎన్ఎంలను నియమించాలని, ఐటిడిఎ డిప్యూటీ డిఇఒ పోస్టును సీనియర్ హెచ్ఎం ద్వారా భర్తీ చేయాలని ఈ కార్యక్రమం ద్వారా డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు.

ఆత్మహత్యకు కారకులెవరు?

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ఇంతవరకు ప్రేమ వ్యవహారాల్లో విఫలమైనవారు, అప్పుల బాధలు తాళలేక రైతులు ఆత్మహత్యలు చేసుకోవడం, ఆర్థిక ఇబ్బందులు, వేధింపులు వంటి కారణాలతో తనువు చాలించడం వంటివి మాత్రమే కనిపించాయి. తాజాగా బొబ్బిలి మండలం అలజంగి గ్రామానికి చెందిన ఉప సర్పంచ్ లక్ష్మునాయుడు చేపట్టిన నిర్మాణ పనులకు బిల్లులు విడుదల చేయలేదని ఏకంగా పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకోవడం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. ఎమ్మెల్యే తనను గుర్తించలేదని, పైగా తనను ఎన్నుకున్న ప్రజల ముందే అవమానిస్తున్నారని కూడా ఆయన మనస్తాపం చెందినట్టు వార్తలు వచ్చాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వ అభివృద్ధి పనులు చేస్తూ అప్పుల ఊబిలో కూరుకుపోయిన కుటుంబాలన్నీ ఉలిక్కిపడ్డాయి. ఆత్మహత్యాయత్నానికి గల కారణాలపై జిల్లాలో చర్చోపచర్చలు సాగుతున్నాయి. వాస్తవానికి ప్రభుత్వ భవనాల నిర్మాణ పనులకు సంబంధించిన బకాయిలు అంతాఇంతా కాదు. జిల్లాలో రూ.కోట్లలో పెండింగ్ ఉన్నాయి. అందుకు తగ్గట్టే ప్రభుత్వ భవనాలు అసంపూర్తితో వెక్కిరిస్తున్నాయి. ఉపాధి హామీలో 40 శాతం నిధులను మెటీరియల్ కాంపొనెంట్ పనులకు కేంద్రం కేటాయించాల్సి ఉంటుంది. ఉపాధి హామీ పనులు ఉపయోగించుకోవడంలో



మన జిల్లా ప్రథమ స్థానంలో ఉంది. వీటిపై జనరేట్ అయిన నిధులతో ప్రభుత్వం తలపెట్టిన సచివాలయాలు, వెల్‌నెస్ సెంటర్లు, బల్క్‌మిల్క్ సెంటర్లు, రైతు భరోసా కేంద్రాలు తదితర భవనాలు నిర్మించాలని భావించింది. దాదాపు అన్ని గ్రామాల్లోనూ స్థానిక సర్పంచులు, లేదా వార్డు మెంబర్లు, కాస్త ఆర్థికంగా అవకాశం ఉన్నవారు అప్పులు చేసి మరీ నిర్మాణ పనులు చేపట్టారు. నిధులు మాత్రం సకాలంలో విడుదల చేయడం లేదు. ఈ ఏడాది రూ.కోట్లలో మెటీరియల్ కాంపొనెంట్ నిధులు విడుదల కావాల్సి ఉంది. అంతకు ముందు సంవత్సరాల్లో చేపట్టిన పనులకు కూడా ఇంకా బిల్లులు కాలేదనే చర్చ నడుస్తోంది. వాస్తవానికి వైసిపి జిల్లా ప్లీనరీ సమావేశాల్లో కూడా సాక్షాత్తూ ఎమ్మెల్యేలు మంత్రి బొత్స సత్యనారాయణ, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, పార్టీ రాష్ట్ర బాధ్యుల ఎదుట ఏకరువు పెట్టారు. ఈ సమస్యను గుర్తించి పరిష్కరించకపోతే భవిష్యత్తులో ప్రభుత్వానికి, పార్టీకి పెద్ద నష్టమే జరుగుతుందని కూడా ఆవేదన వెల్లగక్కారు. నేతలంతా మనకెందుకులే అనుకున్నారో లేక అధినేత తిరస్కరించారో గానీ బిల్లులు పెండింగ్ సమస్య ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్నట్లు ఉంది. దీంతో, ఇన్నాళ్లూ కక్కలేక మింగలేక వ్యవహరిస్తున్నవారు తాజాగా బాహాటంగానే ప్రభుత్వ తీరుపై నిప్పులు చెరుగుతున్నారు. ఇప్పుడు ఆత్మహత్య వరకు వెళ్లడం అత్యంత బాధాకరం. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లు తెరిచి నిధులు విడుదల చేయాలని జనం కోరుతున్నారు.



గ్రామస్తులతో మాట్లాడుతున్న డిఎంహెచ్ఒ జగన్నాథరావు

బొడ్డిడిని సందర్శించిన అధికారులు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని జర్న పంచాయతీ బొడ్డిడి గిరిజన గ్రామాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి బి.జగన్నాథరావు, అడ్మిస్ట్రేటివ్ ఐఇ ప్రభాకర్ రావు, డిఐ నాగేశ్వరరావు శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా అతిసార వ్యాధి ప్రబలడానికి గల కారణాలు, గిరిజనుల ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. గిరిజనుల ఆహారపు అలవాట్లు అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో తాగునీరు, పారిశుధ్యం పరిశీలించారు. అతిసార ప్రబలిన నేపథ్యంలో గ్రామంలో నీటిని పరీక్షలకు పంపించారు. గ్రామంలో స్వచ్ఛమైన నీరు అందుబాటులో ఉండేవి అధికారులు తెలిపారు. కార్యక్రమంలో అడ్మిస్ట్రేటివ్ ఎఈ ప్రవీణ్ కుమార్, సచివాలయం ఉద్యోగులు ఉన్నారు.

డయేరియా బాధితులకు మెరుగైన వైద్యం అందించాలి

ప్రజాశక్తి - కురుపాం

డయేరియా బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జగన్నాథరావు వైద్యులను సూచించారు. శనివారం స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందుతున్న బొడ్డిడి గ్రామానికి చెందిన డయేరియా బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి సిబ్బందితో ఆయన మాట్లాడుతూ డయేరియాతో చికిత్స పొందుతున్న రోగులకు మెరుగైన వైద్యం అందించి ప్రతిక్షణం వైద్యులు పర్యవేక్షణ చేయాలని సూచించారు. ఆయనతో పాటు వైద్యాధికారి కె.సందీప్ కుమార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బ్రిడ్జి నిర్మించాలి : సిపిఎం

ప్రజాశక్తి - కురుపాం :

మండలంలోని మొండెంఖల్ పంచాయతీలో గల ఇచ్చాపురం ప్రధాన రహదారి వద్ద గల పురాతనమైన బ్రిడ్జిని తొలగించి వెంటనే కొత్తది నిర్మించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు డిమాండ్ చేశారు. శనివారం సిపిఎం నాయకులతో కలిసి ఆ బ్రిడ్జిని పరిశీలించారు. అనంతరం వేణు మాట్లాడుతూ మొండెంఖల్ నుండి నీలకంఠాపురం వయా సీతంపేట, శ్రీకాకుళం జిల్లాకు వందలాది మంది ప్రజలు నిత్యం తిరుగుతుంటారని, గతంలో ఎన్నో ప్రమాదాలు జరిగి చాలా మంది ప్రాణాలు కూడా పోగొట్టుకున్నారని అన్నారు. అటువంటి ఈ బ్రిడ్జి చాలా ఇరుగ్గా ఉండడంతో ప్రమాదాలకు జరుగుతున్నాయని, అలాగే ఇది చాలా పురాతనమైందని, కనీసం రక్షణ గోడలు కూడా సరిగ్గా లేవని అన్నారు. ఒకవైపు పూర్తిగా రక్షణ గోడ లేదని ఏదైనా వాహనం అదుపు తప్పితే నేరుగా గెడ్డలో పడి ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నందున ప్రజల ప్రాణాలను దృష్టిలో పెట్టుకొని కొత్త బ్రిడ్జి ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ పరిశీలనలో సిపిఎం నాయకులు కోలక అవినాష్, మండంగి రమణ పాల్గొన్నారు.

21న మండల సర్వసభ్య సమావేశం


ప్రజాశక్తి - వీరఘట్టం

ఈనెల 21న స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ జి.జయంతి ప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపిపి డి.వెంకటరమణ నాయుడు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, మండల స్థాయి అధికారులు సమావేశానికి విధిగా హాజరుకావాలని ఆయన కోరారు.

ఉపాధి పనుల పరిశీలన

ప్రజాశక్తి - భామిని

మండలంలోని బిల్లుమడలోని చెరువు వద్ద జరుగుతున్న ఉపాధిహామీ పనులను శనివారం ఎంపిడిఒ జి.చంద్రరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధి వేతనదారుల సంఖ్య, మస్టరు సీట్ నమోదును పరిశీలించారు. ఎండల తీవ్రత దృష్ట్యా జాగ్రత్తలు తీసుకుంటూ పనులు నిర్వహించాలని, ఉపాధి పనికి వచ్చే వారికి ప్రభుత్వం సూచించిన రోజు వారి వేతనం వచ్చేలా పనులు నిర్వర్తించాలని అన్నారు. కార్యక్రమంలో ఎపిఒ తులసీదాస్, క్షేత్ర సహాయకులు ఉన్నారు.



మహిళలకు ప్రచారకరపత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

కొత్తూరులో గడపగడపకు..

ప్రజాశక్తి - గరుగుబిల్లి

మండలంలోని కొత్తూరులో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం కురుపాం ఎమ్మెల్యే పి.పుష్పశ్రీవాణి ఆధ్వర్యాన శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అర్హులకు ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందజేస్తున్నామన్నారు. ఇంకా ఎవరైనా ఉంటే వాలంటీర్లకు తెలపాలని చెప్పారు. కార్యక్రమం జెడ్పీ వైస్ చైర్పర్సన్ మరిశర్ల బాపూజీ నాయుడు, ఎంపిపి ఉరిటి రామారావు, సర్పంచ్ ద్వారపు రెడ్డి రజని, ఎంపిటిసి జి.అన్నపూర్ణమ్మ, డాక్టర్ ద్వారపురెడ్డి రామ్మోహన్ రావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రికవరీలపై విఒఎలకు సమావేశం

ప్రజాశక్తి - బలిజిపేట

మండలంలోని విఒఎలకు స్థానిక వెలుగు కార్యాలయం నుంచి గ్రామస్థాయిలో గ్రామ సంఘాలకు అందించిన శ్రీనిధి, సిఐఎఫ్, ఉన్నతి ఇతర పథకాల రికవరీల గురించి మండలంలోని విఒఎలకు శనివారం వెలుగు కార్యాలయంలో ఎపిఎం కె.హేమలత శ్రీనిధి మేనేజర్ చంద్రమోహన్, ప్రసన్న సమక్షంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ సంఘాల బలోపేతానికి కృషి చేయాలని, నూతన సంఘాలను ఏర్పాటు చేయాలని తెలిపారు. శ్రీనిధి, సిఐఎఫ్, ఉన్నతి, రికవరీలను సకాలంలో కట్టించేలా సంఘ సభ్యులకు అవగాహన కల్పించాలని కోరారు. ఆరోగ్యం, పోషణ అంశాలపై అవగాహన కల్పించాలని తెలిపారు. కిశోర్ బాలికలు గుర్తించి వారికి ఆరోగ్యంపై అవగాహన కల్పించాలన్నారు. చట్టాలపై మహిళా పోలీస్ సహకారంతో అవగాహన కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఏపిఎంలు ఎ.జయమ్మ, ఏపిఎం హెచ్ డి కె త్రినాధమ్మ, ఇతర మహిళా సంఘ సభ్యులు, విఒఎలు తదితరులు పాల్గొన్నారు

అర్హులకే సిఫార్సు

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి - కొమరాడ

అర్హులైన రైతులకు మాత్రమే పట్టాలు ఇచ్చేందుకు ప్రభుత్వానికి సిఫార్సు చేశామని తహశీల్దార్ సిహెచ్ రాధాకృష్ణ తెలిపారు. 'ప్రజాశక్తి'లో శుక్రవారం ప్రచురితమైన 'పైరవీలకే పట్టాలు' పై సంతకాలు' అన్న కథనానికి ఆయన స్పందించారు. మండలంలోని 421 మంది రైతులు పేర్లు సిఫార్సు చేశామన్నారు. ఎవరి వద్దా డబ్బులు వసూలు చేయలేదని, సిబ్బంది చేస్తే వారిపై చర్యలు తీసుకుంటామని అన్నారు. మండలంలో ఏ గ్రామంలోనైనా రెవెన్యూ సిబ్బందికి డబ్బులు ఇచ్చినట్లు ఫిర్యాదు వచ్చిన దర్యాప్తు చేసి తక్షణమే వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఎంపిడిఒగా మల్లికార్జునరావు

ప్రజాశక్తి - కొమరాడ

మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా ఎం మల్లికార్జునరావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా బాధ్యతలు స్వీకరించిన మల్లికార్జునరావుకు ఎఒ రమేష్ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎంపిడిఒ మాట్లాడుతూ మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు అన్ని విధాలా కృషి చేస్తానని ఆయన తెలిపారు.

విద్యుత్తు ఛార్జీలతో ప్రజలను పీల్చేస్తున్న ప్రభుత్వం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

విద్యుత్ చార్జీల పేరుతో సామాన్య, మధ్యతరగతి ప్రజలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మోయలేని భారం వేస్తున్నాయని సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు విమర్శించారు. మండలంలోని ఎల్విన్ పేటలో కూరగాయల వ్యాపారులతో మాట్లాడారు. శ్రీనివాసరావుకు గత నెల రూ.176 కరెంట్ బిల్లు వస్తే, ఈనెల రూ.294 బిల్లు వచ్చిందని తెలిపారు. నెల రోజులు వ్యవధిలో కరెంట్ బిల్లు రెట్టింపు స్థాయిలో వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశాడు. టి.సింహాచలం కు గత రెండు నెలల్లో రూ.130, రూ.250 వరకు కరెంట్ బిల్లు వస్తే, ఈనెల రూ.330 దాటిందని తెలిపారు. ఇలా ప్రతి ఒక్కరికి కూడా కరెంట్ బిల్లు పెరగడంతో ఆందోళన చెందుతున్నారు. ప్రజల సమస్యను విన్న రెడ్డి వేణు మాట్లాడుతూ ఒకవైపు వేసవి ఎండల్లో మండిపోతుంటే, మరోవైపు విద్యుత్ కోతలతో ప్రజలు అల్లాడుతున్నా పట్టించుకోని ప్రభుత్వం ట్రూ అప్, ఇతర చార్జీల పేరిట బిల్లు అదనంగా వసూలు చేయడంతో దారుణమన్నారు. పెరిగిన బిల్లులతో జనం గగ్గోలు పెడుతున్నారని అన్నారు. గత ఏడాది రూ.1400 కోట్లు చార్జీలు పెంచి ప్రజలపై భారం వేసిందన్నారు. మరో వైపు గత పదేళ్ల నుంచి వాడుతున్న కరెంటు బిల్లులు కట్టిన మళ్లీ సర్దుబాటు చార్జీల పేరుతో జనం నెత్తిన తాజాగా రూ.6వేల కోట్లు భారం వేశారని అన్నారు. ఈ నాలుగేళ్లలో రూ.25



విద్యుత్తు బిల్లును సిపిఎం నాయకులకు చూపుతున్న కూరగాయల వ్యాపారి

వేల కోట్లు ప్రజలపై భారం పెరిగిందన్నారు. ప్రధాని మోడీ ఆదేశాలకు లొంగిపోయి జగన్ ప్రభుత్వం ఇక ప్రతి నెలా వంట గ్యాస్ లాగానే విద్యుత్ చార్జీలు కూడా పెంచడానికి ఆదేశాలు ఇచ్చారని అన్నారు. కరెంట్‌కు బిల్లులే కాకుండా పిక్స్, కస్టమర్, సర్‌చార్జీలు, విద్యుత్ సుంకం, సర్దుబాటు చార్జీలు రకరకాల పేర్లు పెట్టి ప్రజలను పీల్చేస్తున్నారని విమర్శించారు. ఈ ఛార్జీల పెంపును ప్రజలంతా గమనించి ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు మండంగి రమణ, సిఐటియు జిల్లా నాయకులు కోలక అవినాష్ ఉన్నారు.


సీతానగరం : విద్యుత్ ఛార్జీల పెంపునకు నిరసనగా మండలంలో ఉపాధిహామీ వేతనదారులకు కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి రెడ్డి ఈశ్వరరావు మాట్లాడుతూ విద్యుత్ చార్జీల పెంపును ప్రతిఘటించాలని, ఇందుకు సిపిఎం ప్రజలకు అండగా ఉంటుందన్నారు.

పాలకొండ రూరల్ : విద్యుత్ చార్జీల పెంపునకు నిరసనగా సిపిఎం ఆధ్వర్యంలో మండల కేంద్రంలో శనివారం కరపత్రాలు పంపిణీ చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం పాలకొండ మండల కమిటీ కన్వీనర్ డి.రమణారావు మాట్లాడుతూ సర్దుబాటు చార్జీల విధానం రద్దు కావాలని, ట్రూ ఆప్ సర్దుబాటు చార్జీలు వసూళ్ళ నిలిపివేయాలని, స్మార్ట్ మీటర్లు పెట్టరాదని డిమాండ్ చేశారు. సామాన్యులు నడ్డి విరుస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యుత్ చార్జీల పెంపును ప్రతిఘటించండి, ప్రజలకు సిపిఎం అండగా ఉంటుందని, ఐక్య ఉద్యమాలు సాగిద్దామంటూ పిలుపునిచ్చారు. కరపత్రాలు పంపిణీలో డి.దుర్గారావు, కె. రాము తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాలను పరిశీలించాల్సిన బాధ్యత బూత్ ఏజెంట్లదే

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

నియోజకవర్గంలోని బూత్‌ల వారీగా ఓటర్ల జాబితాలపై అప్రమత్తంగా ఉంటూ నిరంతరం పరిశీలించే బాధ్యత సంబంధిత బూత్ ఏజెంట్లదేనని టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి మాజీ ఎమ్మెల్సీ, ద్వారపురెడ్డి జగదీష్ అన్నారు. శుక్రవారం స్థానిక లయన్స్ కల్యాణ మండపంలో జరిగిన టిడిపి పార్వతీపురం నియోజకవర్గస్థాయి బూత్ ఏజెంట్లకు ఓటర్ల జాబితా పరిశీలనపై అవగాహన సదస్సు మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమంలో జగదీష్ మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో విజయం సాధించడానికి అధికార వైసిపి ఎన్నో కుయుక్తులు పన్నుతుందని, ఇందులో భాగంగా తమకున్న వాలంటీర్ల వ్యవస్థతో గుట్టుగా టిడిపి ఓట్లను తొలగించడానికి ప్రయత్నాలు జరగడమే కాకుండా, వైసిపి నుకూలమైన వారితో భారీ సంఖ్యలో ఓటర్లు నమోదు చేయడం లక్ష్యంగా పెట్టుకుందని ఆరోపించారు. కావున ప్రతి బూత్ ఓటర్ల జాబితాను ఎప్పటికప్పుడు పరిశీలించి అధికారపక్ష కుట్రలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎఎంసి మాజీ చైర్మన్ రెడ్డి శ్రీనివాసరావు, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ డి.శ్రీదేవి, మండల, పట్టణ పార్టీ అధ్యక్షులు డి.మోహన్ రావు, జి.రవికుమార్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సీతానగరం : ఉపాధ్యాయులు, విద్యార్థులను సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు

విద్యార్థులు ఉన్నత స్థానాలకు చేరుకోవాలి

ప్రజాశక్తి -సీతంపేట

జగనన్న ఆణిముత్యాలు స్కూల్ లెవెల్ కార్యక్రమంలో భాగంగా మల్లి బాలుర గురుకుల పాఠశాలలో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మల్లి, ముత్యాలు, సంభాం, వొంగ్రుజోల, మల్లి బాలుర గురుకుల పాఠశాల బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలలు విద్యార్థులు, ప్రధానోపాధ్యాయులు హాజరయ్యారు. ఇందులో ప్రథమ, ద్వితీయ, తతీయ స్థానాల్లో వచ్చిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, మెడళ్లను అందజేశారు ఈ సందర్భంగా ప్రధాన ఉపాధ్యాయులు పాలక నారాయడు మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివితే ఉన్నత శిఖరాలకు అధిరోహించవచ్చని అన్నారు. ప్రభుత్వం విద్యార్థులకు ప్రోత్సహిస్తుందని దీని విద్యార్థులు వినియోగించుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎపిఆర్ఎస్ ప్రిన్సిపల్ వాసుదేవరావు, ముత్యాలు ప్రధానోపాధ్యాయులు హెచ్.శ్రావణి, ఆశ్రమ పాఠశాల హెచ్ఎం ఎం.భాస్కర రావు తదితరులు హాజరయ్యారు.

పాలకొండ: స్థానిక పోస్ట్ ఆఫీస్ రోడ్ లో గల బాలికల ఉన్నత పాఠశాలలో జగనన్నఆణిముత్యాలు కార్యక్రమం పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు గుడ్ల రేణుక దేవి అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైసిపి పట్టణ అధ్యక్షులు, ఐదో వార్డు కౌన్సిలర్ వెలమల మన్మధరావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. జగనన్న ఆణిముత్యాలకు ఎంపికైన తాడేల సాద్విక, జంప తారకేశ్వరి, డొకర రామలక్ష్మిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో. కౌన్సిలర్లు భాసూరుకాంతారావు, కోడెం విజయ్‌కుమార్, కడగల వెంకటరమణ, తుమ్మగుంట శంకర్రావు, కిల్లారి మోహనరావు, టేకి రామకష్ణ, ఉపాధ్యాయులు బి శ్రీదేవి, ఎన్ భారతరత్నం, పి కామేశ్వరి, ఎం.గుణసుందరి, ఎం.లత, ఎం.చిరంజీవి, జె. రమాకుమారి, వి.చిన్నమ్మడు, టి.సుగుణ, దుమ్మెద ప్రభావతి, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

సీతానగరం : మండలంలోని నిడగల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జగనన్న ఆణిముత్యం వేడుకల కార్యక్రమం నిర్వహించారు. టెన్త్‌లో ప్రతిభ కనబర్చిన రాజేష్, బి.హేమంత్, బి.జగదీష్‌కు సర్పంచ్ రావిపల్లి ఆరుద్రం చేతుల మీదుగా నగదును ప్రశంస పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి టి.సూర్యనారాయణ, మాజీ వైస్ ఎంపిపి ప్రసాద్ పాత్రుడు, గ్రామ పెద్దలు గాజాపు శ్రీనివాసరావు, స్కూల్ కమిటీ చైర్మన్ కనుగొడ్డు ఉషారాణి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు మారడాన శివున్నాయుడు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు

వీరఘట్టం: మండలంలోని తలవరం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల ఆవరణలో ఈ ఏడాది పదో తరగతి ఫలితాల్లో ప్రతిభ చూపిన పేర్ల చైతన్య, బి.శివ సాయి, వావిలపల్లి తనూజ జగనన్న ఆణిముత్యం కార్యక్రమంలో భాగంగా నగదు బహుమతితో పాటు ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ చైర్మన్ అల్లు శ్రీనివాసరావు, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సాలూరు రూరల్ : టెన్త్ తరగతి పరీక్షా ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు లిఖిత, సుమతి, మేఘనను వైస్ ఎంపిపి సువ్వాడ గుణవతి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.పెంటయ్య, విద్యాకమిటీ చైర్మెన్ డొంక అశోక్ బాబు, మాజీ వైస్ ఎంపిపి సువ్వాడ రామకష్ణ, త్రినాధ్, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సాలూరురూరల్: విద్యార్థులను సన్మానిస్తున్న వైస్ ఎంపిపి గుణవతి

పార్వతీపురం రూరల్ : మండలంలోని డోకిసిల గిరిజన సంక్షేమ ఉన్నత పాఠశాలలో జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు గోవిందరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో టెన్త్ ఫలితాల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు నగదు పంపిణీ కార్యక్రమాన్ని స్థానిక వైసీపీ నాయకులు బొమ్మి రమేష్ అందజేశారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

భామిని : మండలంలోని బాలేరు జిల్లా పరిషత్ హై స్కూల్ జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం ఎంపిటిసి సభ్యులు కొత్తకోట చంద్రశేఖర్ ఆధ్వర్యాన జరిగింది. టెన్త్ ఫలితాల్లో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన కేవటి రేవతి, యార్ణగుల పద్మిని, పెదకోట కుమారికి నగదు బహుమతి, ప్రశంసాపత్రాలను సర్పంచ్ జామి ప్రభాకర్, జె సి ఎస్ కో -ఆర్డినేటర్ కొత్తకోట చంద్రశేఖర్ అందజేశారు. కార్యక్రమంలో ఎంపిటిసి పాలక ఉషారాణి, కాపు డైరెక్టర్ మెడిబోయిన చలపతిరావు, వైసిపి సీనియర్ నాయకుకు కొత్తకోట ఆంజనేయులు, హెచ్ ఎం జామి ప్రభాకర్, ఉపాధ్యాయులు ఉన్నారు.



టివి రోగికి ఆహార కిట్లును అందజేస్తున్న ఆసుపత్రి సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, రెడ్‌క్రాస్ చైర్మన్ శ్రీరాములు

క్షయ నిర్మూలనకు కృషి

ప్రజాశక్తి - సీతంపేట

క్షయ వ్యాధి నిర్మూలనకు అందరూ సమిష్టిగా కృషి చేయాలని స్థానిక ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బి.శ్రీనివాసరావు అన్నారు. శనివారం స్థానిక ఏరియా ఆస్పత్రిలో జాతీయ క్షయ నిర్మూలన కార్యక్రమంలో భాగంగా ప్రధానమంత్రి టిబి ముక్తభారత్ అభియాన్ పౌష్టి ఆహారం కిట్లను ఆర్ట్స్ సంస్థ, రెడ్‌క్రాస్ సహకారంతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షయ వ్యాధిగ్రస్తులకు ఈ పౌష్టికాహారం కిట్లు అందిస్తున్న సంస్థలకు అభినందనలు తెలిపారు. రోగులు ఈ పౌష్టికాహారం తిని క్షయ వ్యాధి నుంచి బయటపడాలని కోరారు. రెడ్ క్రాస్ చైర్మన్ డాక్టర్ ఎం.శ్రీరాములు మాట్లాడుతూ ఈ కిట్లను 67 మందికి పంపిణీ చేశామన్నారు. ప్రతి ఒక్కరూ ఆరు నెలలపాటు తీసుకోవాలన్నారు. సంస్థ సభ్యులు బి.శంకరరావు మాట్లాడుతూ ఆదివాసీ ప్రాంతాల్లో ఈ కార్యక్రమం వారికి కొంత చేయూత ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ కిట్‌లో బియ్యం, పప్పులు, నూనె, వేరుశనగ ఉండలు, ఖర్జూరం, బాదంపప్పుతో పాటు రూ.500 అందజేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ వెంకట్రావు, డాక్టర్ గౌరీ శంకర్, చిన్నారావు, రెడ్‌క్రాస్ సొసైటీ, టిబి ఇన్‌స్పెక్టర్లు, ఆర్ట్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.

అవుట్ డ్రెయినేజీ వ్యవస్థ పక్కాగా ఉండాలి : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

జగనన్న కాలనీల్లో డ్రైనేజీ వ్యవస్థ పక్కాగా ఉండాలని కలెక్టర్ నిశాంత్ కుమార్ ఆదేశించారు. అడ్డాపుశీల జగనన్న కాలనీని శనివారం జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. నిర్మాణాలను, డ్రైనేజీ వ్యవస్థను, ఇతర మౌలిక సదుపాయాలను పరిశీలించారు. డ్రైనేజీ వ్యవస్థ పక్కాగా ఉండాలని, తద్వారా కాలనీ పరిశుభ్రత ఆధారపడి ఉంటుందని ఆయన అన్నారు. ప్రతి ఇంటిని డ్రైనేజీతో అనుసంధానం చేయాలని ఆదేశించారు. ఇళ్లను వేగవంతంగా నిర్మించి ప్రతి లబ్ధిదారు సొంత ఇంటిలోకి ప్రవేశించి ఆనందించాలని అన్నారు. త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఇఇ ప్రసాద్‌ను ఆదేశించారు.

కొత్తవలస సచివాలయం తనిఖీ

పార్వతీపురం అర్బన్ కేంద్రంలో కొత్తవలసలో ఉన్న సచివాలయంను తనిఖీ చేసిన కలెక్టర్ సచివాలయం నుంచి ప్రజలకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. అమ్మఒడి పథకం కొత్తగా ఎంత మందికి వచ్చిందని ఆరా తీయగా, 52మంది లబ్ధిదారులకు మంజూరైందని సిబ్బంది తెలిపారు. బయోమెట్రిక్ అటెండన్స్ వివరాలు, శానిటరీ వర్కర్స్ ఎంత మంది అందుబాటులో ఉన్నారు, శానిటరీ పరికరాలు సరిగా పనిచేస్తున్నాయా, లేదా అని ఆరా తీశారు. రానున్న రోజుల్లో సచివాలయం వ్యవస్థ మరింత కీలకం కానుందని అందుకు అనుగుణంగా సిబ్బంది సేవలు అందించాలని ఆదేశించారు. రిజిస్ట్రేషన్లు, జగనన్న సురక్ష, జగనన్నకు చెబుదాం వంటి కార్యక్రమాల అమలులో సచివాలయ వ్యవస్థ కీలకమని చెప్పారు. ప్రజల ఆర్జీల పరిష్కారంలో ప్రత్యేక చొరవ చూపించాలని ఆదేశించారు. ప్రతి ఒక్కరూ బాధ్యతతో పనిచేయాలన్నారు. కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

ముందు టిడిపిని చక్కదిద్దుకోండి

సంధ్యారాణి పై ఎంపిపి ఫైర్

ప్రజాశక్తి - పాచిపెంట

సాలూరు నియోజకవర్గ ఇన్చార్జి సంధ్యారాణి తన సొంత పార్టీలో గ్రూపు రాజకీయాలను చక్కదిద్దుకోవాలని ఎంపిపి బి.ప్రమీల హితవు పలికారు. శనివారం తన చాంబర్లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. నియోజకవర్గ ఇంఛార్జి హెూదాలో మాజీ ఎమ్మెల్సీ సంధ్యారాణి గందరగోళంలో ఉన్నట్టు కనిపిస్తున్నారని చెప్పారు. పాచిపెంట మండలంలో టిడిపి అధ్యక్షుడెవరో తెలియని అయోమయంలో కార్యకర్తలు వున్నారన్నారు. మాజీ ఎమ్మెల్యే ఆర్పీ భంజ్ దేవ్ కూడా టిడిపి టిక్కెట్ రేసులో ఉన్నారనే ప్రచారం జరుగుతుండడంతో సంధ్యారాణి మతిస్థిమితం లేకుండా వైసిపి ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నారని చెప్పారు. ఇటీవల పి.కోనవలసలో పార్టీ సమావేశం లో ఆమె సిఎం జగన్ మోహన్ రెడ్డిపై అవాస్తవాలు మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. గత ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన మేనిఫెస్టో లో వున్న హామీ ల్లో 99శాతం అమలు చేశారని తెలిపారు. 2014 ఎన్నికల్లో టిడిపి ప్రకటించిన మేనిఫెస్టోలో ఎన్ని హామీలను చంద్రబాబు నాయుడు అమలు చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. పాచిపెంట మండలంలో టిడిపి ప్రభుత్వం హయాంలో ఎన్ని గిరిజన గ్రామాలకు రోడ్లు నిర్మించారో, ఎంతమందికి సంక్షేమ పథకాలు అందించారో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మండలంలో డిప్యూటీ సీఎం రాజన్నదొర సహకారం తో జరిగిన అభివద్ధి, సంక్షేమ పథకాలపై చర్చకు ఎప్పుడైనా సిద్ధమేనని సవాల్ చేశారు. సమావేశంలో వైసిపి సీనియర్ నాయకులు పి.చినబాబు, మండలపార్టీ అధ్యక్షులు జి.ముత్యాలనాయుడు, మాజీ వైస్ ఎంపిపి టి.గౌరీశ్వరరావు, ఎంపిటిసి సభ్యులు దండి కొండలరావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి నాగమణి

పబ్లిక్ హెల్త్ యూనిట్ ఏర్పాటుకు ఆమోదం

ప్రజాశక్తి - బలిజిపేట

స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రూ.50లక్షల వ్యయంతో హెల్ యూనిట్ ఏర్పాటుకు అభివృద్ధి కమిటీ ఆమోదం తెలిపింది. శనివారం స్థానిక పిహెచ్‌సిలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం ఎంపిపి గుడివాడ నాగమణి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ జిల్లాలో సాలూరు, పాచి పెంట, గుమ్మలక్ష్మీపురం, భామిని, బలిజిపేట మండలాల్లో బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్లు మంజూరయ్యాయని, అందులో భాగంగా మన మండలంలో యూనిట్ నిర్మాణం జరుగుతుందన్నారు. వైద్య పరమైన అభివృద్ధికి ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేయడంలో ముందంజలో ఉందన్నారు. మండల పరిధిలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు ఉపయోగపడేలా ఈ బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్ ఉపయోగపడుతుందని, ల్యాబ్ ఎక్యూప్మెంట్, ఇతర సామాగ్రి నిల్వ చేసుకోవడానికి ఇతర ఆరోగ్యపరమైన వసతులకు ఈ యూనిట్ ఉపయోగపడుతుందని ఆమె తెలిపారు. ఎంపీపీ చైర్మన్, వైద్యాధికారి మహిపాల్ కన్వీనర్‌గా మిగతా ఐదుగురు సభ్యులతో కూడిన తీర్మానం ఈ యూనిట్ నిర్మాణ అనుమతికి ఉపయోగపడుతుందన్నారు. సమావేశంలో తహశీల్దార్ పి.అప్పలరాజు, ఎంపిడిఒ కె.విజయలక్ష్మి, స్థానిక సర్పంచ్ బి.రాగలత, వెంగళరాయపురం సర్పంచ్ గోలు లక్ష్మి, సిహెచ్ఒ వెంకటరమణ, సీనియర్ అసిస్టెంట్ రాజశేఖర్, ఆర్ఐ పి.రామచంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్తు ఛార్జీలు తగ్గించాలి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని జనసేన నాయకులు కోరారు. శనివారం విద్యుత్ శాఖ ఇఇకిషోర్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల కరెంటు బిల్లులు ముందుకంటే మూడింతలు అధికంగా వచ్చాయని పలువురు వినియోగదారులు తమ దృష్టికి తీసుకొచ్చారన్నారు. విద్యుత్ ఛార్జీల బిల్లులు చూస్తే షాక్ కొడుతున్నాయని ప్రజలు ఆవేదన చెందుతున్నారని అన్నారు. సర్దుబాటు, ట్రూ అప్ ఛార్జీల పేరుతో ప్రజలపై భారం వేయడం సరికాదన్నారు. తక్షణమే వాటిని తగ్గించాలని, డిస్కంలకు ప్రభుత్వం చెల్లించాల్సిన సబ్సిడీ చెల్లించకుండా ప్రజలపై ఆ భారం వేయటం సరికాదన్నారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాలుగేళ్లలో ప్రతి ఏటా విద్యుత్ ఛార్జీలు పెరిగాయన్నారు. అలాగే విద్యుత్‌కోతలను కూడా అరికట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రెడ్డి కరుణ, వంగల దాలినాయుడు, అన్నా బత్తుల దుర్గాప్రసాద్, రౌతు బాలాజీ, పాటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామ సంఘం సహాయకురాలిపై విచారణ

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని కంబరవలస గ్రామ సంఘం సహాయకురాలిపై శనివారం ఎపిఎం జి.శివున్నాయుడు విచారణ చేపట్టారు. ప్రభుత్వం వివిధ రకాలైన సంక్షేమం పథకాలను లబ్ధిదారులకు అందజేసినప్పుడు ఈమె ప్రతి ఒక్కరి నుంచి రూ.100 వసూలు చేస్తున్నట్లు వచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టినట్లు ఆయన తెలిపారు. కొంతమంది స్వచ్ఛందంగా ఇస్తున్నట్లు, మరి కొంతమంది నుంచి బలవంతంగా వసూలు చేస్తున్నట్టు విచారణలో తెలిపారన్నారు. ఈ నివేదికను జిల్లా అధికారులకు అందజేయనున్నట్లు ఎపిఎం తెలిపారు.

కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్

విద్యుత్తు లేక ప్రజలకు అవస్థలు

ప్రజాశక్తి - సాలూరు

పట్టణంలోని డబ్బివీధి చికెన్ సెంటర్ పక్కన గల విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ కాలిపోవడంతో శుక్రవారం రాత్రి నుంచి 27,24వార్డు ప్రజలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో శనివారం కూడా విద్యుత్ సరఫరా లేకపోవడంతో ప్రజలు ఉక్కపోతతో అల్లాడిపోతున్నారు. పగటిపూట ఉష్ణోగ్రత ఎక్కువగా వుండడం, విద్యుత్ సరఫరా లేకపోవడంతో డబ్బివీధి ప్రజలు అట్టుడికిపోయింది. శనివారం 44డిగ్రీల వరకు ఉష్ణోగ్రత నమోదైంది. విద్యుత్ సరఫరా లేని కారణంగా ఇళ్లల్లో నీటి మోటార్లు కూడా పని చేయలేదు. దీంతో జనం కుతకుతలాడిపోయారు. విద్యుత్ అధికారులకు ఫిర్యాదు చేసినా సకాలం లో స్పందించడం లేదని స్థానికులు చెబుతున్నారు. శనివారం రాత్రికైనా సర ఫరా పునరుద్ధరణ అవుతుందా లేదానని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

ముమ్మరంగా ఎన్‌సిడి, డిసి సర్వే

ప్రజాశక్తి -భామిని

మండలంలోని భామిని, బత్తిలి, బాలేరు పిహెచ్‌సిల పరిధిలో గల గ్రామాల్లో నాన్ కమ్యూనికేబుల్ డిసీజ్, కమ్యూనికేబుల్ డిసీజ్ సర్వేను అయుష్మాన్‌భవ కార్యక్రమంలో శుక్ర, శనివారాలు నిర్వహించించామని వైద్యాధికారులు తెలిపారు. ఈ సర్వేలో భాగంగా గ్రామాల్లో ప్రతీ ఇంటికి వెళ్లి బిపి, సుగర్, ఇతర వ్యాధి సంబంధిత ఆరోగ్య వివరాలను సిగ్నల్ లేని గిరిజన గ్రామాల్లో వేరే ప్రాంతాలకు తరలించి నమోదు చేస్తున్నామని తెలిపారు. బత్తిలి పిహెచ్‌సి పరిధిలో 84శాతం, భామినిలో81శాతం సర్వే పూర్తి చేసినట్లు వైద్యాధికారులు కె.రవీంద్ర, పసుపులేటి సోయల్ తెలిపారు.

యువకుడు అదృశ్యం

ప్రజాశక్తి - కురుపాం

మండల కేంద్రమైన కురుపాంలోనిదాసరి వీధికి చెందిన పోరెడ్డి ఈశ్వరరావు (ప్రభు) (22) గత వారం రోజులుగా కనిపించలేదు. ఆయనకు మతిస్థిమితం లేదు. కుటుంబ సభ్యులు చుట్టాలు, బంధువులు ఇళ్ల వద్ద వెతగ్గా కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఎస్ఐ సిహెచ్ ప్రసాద్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.